
# గచ్చు

## ఎన్.కె.బాబు



అట్టే దూరం లేదు. అయినా ఎంతో దూరంలా అనిపిస్తోంది. తను మిలటరీలో చేరి పన్నెండేళ్ల యింది. ఈ పన్నెండేళ్లలో అయిదారు సార్లు శెలవుపై వచ్చినా చెల్లాయిని చూడ్డం కుదర్లేదు. ఉన్న తక్కువ రోజులలో ఇంటి పనులు, పిల్లల బాగోగులు, శ్రీమతితో ప్రణాళికలు, మిగతా వ్యవహారాలతో సమయం అయిపోయేది. కానీ ఈ సారి మరో రెండువారాలు అదనంగా శెలవు తీసుకొని చెల్లాయిని చూసివెళ్లాలని నిశ్చయించుకోవడంతో ఈ ప్రయాణం పడింది.

బస్సు మరీ నెమ్మదిగా వెళ్తోంది. మరో మూడేళ్లలో తను పూర్తిగా రిటైర్ అయ్యేవరకు రాలేదన్న కోపం చెల్లికి ఉంటుంది. సర్వీసులో ఉండగానే తనను చూడాలన్న తపనతో బయలుదేరడమయింది.

మరుపల్లి దగ్గర ఆగింది బస్సు. ఏం మారలేదు ఊరు. చెల్లాయి తను కలిసి ఎన్నో సార్లు ఈ ఊరి సిర్లి పండగకు వచ్చారు! ఇక్కడి తిరునాళ్లని సిర్లి అంటారు. నాన్న చేతి వేళ్లని పట్టుకోవాలంటే నా చేతిని పైకెత్తవలసి వచ్చేది. ఆ వేళ్లని వదలకుండా పట్టుకొని నడిచేవాడిని. అప్పుడు నా వయసు నాలుగేళ్లు. చెల్లిని నాన్న ఎత్తుకునేవారు.

ఏవైనా బస్సులు, సైకిళ్లు ఎదురైనా, గుంపులుగా ఉండే జనం మధ్యనుంచి వెళ్లినా నాన్న నాచెయ్యి గట్టిగా పట్టుకునేవారు. ఆ పట్టులో ఏదో రక్షణ కన్పించేది నాకు. చెల్లాయిని ఎత్తుకున్నట్టుగా కాక గుండెలకు హత్తుకున్నట్టుగా ఉండేది. అప్పుడు నా అనుభూతులను పైకివెల్లడించాలని ఉన్నా, వాటిని నాన్నకి ఎలా చెప్పాలో తెలిసేది కాదు.

సిర్లిలో నాన్న నా చేయిని వదలకుండానే వస్తువులను బేరమాడి తీసుకునేవారు. ముఖ్యంగా పంచదారచిలకలు ఎంత ముద్దుగా ఉండేవి! గులాబీ రంగుచిలకలైతే వరుసలో... ముందు పెద్దవి, ఆ తర్వాత చిన్నవి, ఇంకా ఆ తరువాత మరీ చిన్నవి... ఇలా క్రమంగా అందంగా పేర్చి మా నోళ్లూరించేవారు. నేను గులాబీ రంగు చిలకల్నే కొనమని మారాం చేసేవాణ్ణి. తను తెల్లనివే కొంటూ చిలకలకు వేసే ఆ రంగుల్లో విషం ఉంటుందంటూ నన్ను బుజ్జగించేవారు. చెల్లి నాన్న గారి మాటలకు భయపడిపోయేది.

**ఆ రాతి గచ్చుపై ఎన్నో ఆటల్ని ఆడుకోడానికి వీలుగా చెక్కించారు నాన్న. దాడి, పులి–మేక లాంటి ఆటల్ని చింతపిక్కల తోనూ, గవ్వల తోనూ, చిన్న చిన్న గులకరాళ్లతోనూ ఆడేవాళ్లం.**

"అమ్మో..." అంటూ కళ్లు పెద్దవి చేసేది. బూరలు కొనమనేది చెల్లి. నేను పీపీపీ అంటూ విజిల్స్‌ని, కళ్లజోడునూ కొనమనేవాణ్ణి. నాన్న వాటిని దండగమారి వస్తువులని, వద్దన్నా వినకుండా కొనిపించి చెల్లికి ఇచ్చేవాణ్ణి. సిర్లి నుండి ఇంటికి వచ్చే దారంతా చెల్లి గంతులే గంతులు.

బస్సు కుదుపులకి మెలుకువ వచ్చేసింది. కండక్టర్ గుడివాడ అంటున్నాడు. చిన్న ఏరు. నీరు అంతగా లేదు. కాని నా చిన్నప్పుడు ఇక్కడంతా నీరే. వర్షాకాలం అంతా ఈ బ్రిడ్జి పైనుండే వెళ్లేవాళ్లం. ఏరుకి ఓ పక్క గుడివాడైతే మరోపక్క మా ఊరు. ఎండాకాలం నీరు ఎక్కువగా ఉండక పోవడంతో ఆ ఇసకలో చెల్లీ నేను నడుస్తూ గుడివాడకు పది నిమిషాల్లో వెళ్లి వచ్చేవాళ్లం. వర్షాకాలం యమయాతనగా ఉండేది. మాకు కూరగాయలు, పాలు, పుట్ట గొడుగులు అక్కడ్నిండే వచ్చేవి. మా పనిమనుషులను పిలుచుకుని రావాలన్నా మేం ఆ ఊరే వెళ్లేవాళ్లం.

చెల్లాయి నేను మా నౌకరు వెంకడ్ని తోడుగా తీసుకొని పొలానికి వెళ్లి తాటి చెట్ల గెలలు కొట్టించి ముంజలు తీయించి తినేవాళ్లం. దీపావళి ముందు రోజులలో వేరు శనక్కాయల మొక్కల్ని కాయల్తో పాటే పెకిలించి పొలంలోనే కాల్చుకు తినేవాళ్లం. మా వెంకడు బురద నీటిలో దిగి బొమ్మిడాలు పట్టి వాటిని కాల్చి ఇచ్చేవాడు. ఎంతో మెత్తగా రుచిగా ఉండేవి. రాగులపంట కోతకు ఒక నెల రోజుల ముందు కంకులు పచ్చటి పసిమితో పొటమరించేవి. వాటిని నిప్పుల్లో కాల్చి, రెండు చేతుల్తో గచ్చుపై నలపగానే గింజలు వేడివేడిగా రాలేవి. వాటిల్లో పంచదార, నువ్వులు కలిపి తినేవాళ్లం.

వర్షాకాలం ఏరువాకలప్పుడు చెల్లాయి, నేను పొలాల గట్ల వెంబడి ఉండే బలుసు పళ్లను ఏరుకొనేవాళ్లం. మిగతా కాలాల్లో పరిమి పళ్లు, వాకపళ్లు, ఈతపళ్ల కోసం గట్లవెంట, పుట్టలెంటా తిరిగి ఏరుకునేవాళ్లం. ఏరినవాటిని ఇంట్లోని గచ్చుపై పోసి వంతులు పంచుకునేవాళ్లం.

ఆ రాతి గచ్చుపై ఎన్నో ఆటల్ని ఆడుకోడానికి వీలుగా చెక్కించారు నాన్న. దాడి, పులి-మేక లాంటి ఆటల్ని చింతపిక్కలతోనూ, గవ్వలతోనూ, చిన్న చిన్న గులకరాళ్లతోనూ ఆడేవాళ్లం.


అప్పట్లో రావూజి అని ఓ బంధువు ఏదో ఊరునిండి వచ్చాడు. అప్పుడు మేం దాడి ఆట ఆడుతున్నాం.

"మీకు చదరంగం వచ్చా" అడిగాడతను. ఆ పేరు వినడం అదే మొదటిసారి నేను. రాదని చెప్పాను. ఆయన తన సంచిలోంచి చదరంగం బల్ల తీశాడు. తెలుపు నలుపు రంగుల్లో ఉన్న సైన్యాన్ని, గుర్రాల్ని, ఏనుగుల్ని, రాజు, మంత్రి... ఇలా అన్నీ ఆ చదరంగం బల్లపై ఎలా పేర్చి ఆడాలో నేర్పించాడు. మాకు బాగా ఆట వచ్చేసింది. రావూజి వెళ్లిపోయారు. చదరంగం పై చెల్లీ నేనూ చూపించే శ్రద్ధకి నాన్న రోళ్ళు చెక్కే కాశయ్యని పిలిపించి 64 గళ్లతో స్కేల్ కొలతలతో చతురస్రాకారంలో ఉలితో చెక్కించేరు. ఆ తరువాత నల్ల పెయింట్‌తో గడి వదిలి గడికి రంగు పూయించారు. మా వీధి చివర్లో ఉన్న ఆచారిని పిలిపించి చదరంగం బలగాలను ఎలా చేయాలో చెప్పారు. నల్లటి ఇరిడి కర్రతో నల్ల బలగాలను, తెల్ల మామిడి చెక్కతో తెల్ల బలగాలను



## వెనిగళ్ళ కోమల

చెల్లుకు చెల్లు అనువదించిన వెనిగళ్ళ కోమల (జననం 1935) అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి రిటైర్ అయిన ఇంగ్లీషు ప్రొఫెసర్. స్త్రీ స్వేచ్ఛపై అనేక రచనలు చేశారు. అమెరికా పర్యటన చేశారు. ఆమె కుమారుడు నరిశెట్టి రాజు వాల్‌స్ట్రీట్ జర్నల్ ఎడిటర్‌గా, కుమార్తె నవీన అమెరికాలో చిన్నపిల్లల సైకియాట్రిస్ట్‌గా వున్నారు. పిల్లి ఆత్మకథ (ఎం.ఎన్.రాయ్ రచన) తెనిగించారు. తస్లీమాతో ఆమెకు వ్యక్తిగత పరిచయం వుంది. ప్రస్తుత నివాసం హైదరాబాద్, జర్నలిస్ట్ కాలనీ.




వారం రోజుల్లో చేయించారు. ఆ తరువాత నేను చెల్లాయి ఎన్నో గంటలు... కాలం తెలిసేది కాదు. అలా ఆడుతూ ఆడుతూ ఎప్పుడో ఆ గచ్చుపైనే పడి నిద్ర పోయేవాళ్లం.

ఆ రాతి గచ్చులో ఓ చివర్న రుబ్బురోలు కూడా ఉండేది. అమ్మ ఏదయినా దంచాలన్నా , రుబ్బాలన్నా ముందుగా ఆ రోలుని శుభ్రం చేసే పని మా ఇద్దరికి అప్పగించేది.

ఎప్పుడైనా మేం చదరంగం ఆడుతున్నప్పుడు ఆ రోలు శబ్దం చిరాకు తెప్పించేది.

''రోలుని బయట చెక్కించినా బాగున్ను '' అనే వాణ్ణి.

''బయట ఎండలో ఎలా రుబ్బుతామర్రా...మీ ఆటలకోసం మేం బయటకెళ్లాలా''అనేది నవ్వుతూ.

''మన ఇంటి ఆడవాళ్లు బయటకి కన్పించకూడదురా పిచ్చినాగన్నా'' అనేది నాన్నమ్మ.

ఏది ఏమైనా గచ్చు మా ఇద్దరికీ ఓ ఆత్మీయ నేస్తం.

మా ఇంట్లో వరహాలని పనమ్మాయి ఉండేది. నీళ్లని ఎర్ర చెరువునుంచి తెచ్చేది. ఎర్ర చెరువు అని ఎందుకంటారో అప్పుడు తెలిసేది కాదు. దూరంగా ఎక్కడో కొండల్లోంచి జారే వర్షపు నీరు ఆ చెరువులో చేరి నీళ్లన్నీ ఎర్రగా అయిపోయేవి. చెల్లాయి నేను ఇంపుడు కాయల్ని గచ్చుపై అరగదీసి ఆ గంధాన్ని నీళ్ల బిందెల్లో కలిపేస్తే, ఎర్ర మట్టంతా కిందకు దిగిపోయి తేటనీరు పైకి తేలేది. ఇంపుడుకాయలు ఫిల్టర్‌లా పని చేసేవి.

బస్సు మానాపురం గేటు దగ్గర ఆగింది. రైలేదో వస్తున్న చప్పుడు. మాకు బస్టాపు కూడా అదే. నా ఎయిర్ బ్యాగ్ తీసుకొని దిగాను. నాతో పాటూ మరో ముగ్గురు దిగారు. గజపతినగరం వెళ్లే పాసింజర్ రైలు ఉంది. ఇప్పుడది డీసిల్ ఇంజన్. నా చిన్నప్పుడు స్టీమ్ ఇంజనే కదా...డ్రైవర్‌కి వత్తిడి ఎక్కువయినప్పుడల్లా తెల్లటి పొగ మంచులా ఉండే స్టీమ్‌ని వదిలేవాడు. ఆ తుంపర్లలో నేనూ, చెల్లాయ్ తడుస్తూ కేరింతలు కొట్టేవాళ్లం.

ప్లాట్‌ఫారం అంతా విశాలమైన రాతి గచ్చుతో ఉండేది. స్టేషన్ మాస్టర్ రూమ్, టికెట్లు ఇచ్చే హాలు సిమెంటు గచ్చుతో ఉండేవి. రైలు వచ్చేవరకూ ఇద్దరం అక్కడే ఆడుకునేవాళ్లం.

ఊర్లో నడుస్తోంటే తెలిసిన వాళ్లు పలకరిస్తున్నారు. ఇప్పుడంతా సిమ్మెంటు రోడ్లు. చెల్లాయికి ఇదే ఊర్లో సంబంధం తెచ్చారు నాన్న. మేం చిన్నప్పుడు ఆడిపాడిన ఇంటిని దాని పేర రాసిచ్చేసి, ఓ రకంగా ఇల్లరికం తెచ్చుకున్నట్టుగా అల్లుణ్ని, కూతుర్ని కళ్లముందే చూసుకున్నారు చాన్నాళ్ల వరకు. పొలం అమ్మిన డబ్బుల్తో పట్నంలో స్థలం కొన్నారు. ఆ తర్వాత నా పెళ్లయిపోవడం మిలట్రీలో ఉద్యోగం రావడంతో దేశాలు పట్టుకు పోవడం జరిగింది. ఓ రెండేళ్ల క్రితం నాన్న పోయినప్పుడు నా ఫ్యామిలీని కూడా తీసుకొచ్చి పట్నంలోనే నాన్న కట్టిన ఇంట్లో ఉంచేశా. చెల్లి తనను అప్పుడు ఊరికి రమ్మందిగానీ టైం లేక వెళ్లలేకపోయాడు.

ఇల్లు పాతబడిపోయిందని మళ్లీ కట్టించారట. గృహప్రవేశానికి నేను లేను. దూరం నుంచే కన్పిస్తోంది పెద్ద డాబా ఇల్లు.

మనసంతా ఒక రకమైన బాధ ఆవరించేసింది. నా బాల్యంలోని మధురమైన అనుభూతులకు చిహ్నంగా వున్న ఆ ఇంట్లో ఇప్పుడు మేం ఆడుకున్న గచ్చు మాయం అయిపోయి ఉంటుంది. ప్రాణం ఉసూరుమంది. గచ్చు మా నేస్తం. ఎన్నెన్ని ఆటలాడి అలసి సొలసి ఆదమరచి గచ్చు తల్లి ఒడిలో నిద్రపోయేవాళ్లం.

ఇంటి చుట్టూ ఉన్న చెట్లన్నీ అలానే ఉన్నాయి . పెంకుటింటి స్థానంలో పెద్ద డాబా ఇల్లు మాత్రమే మార్పు. మేం చిన్నప్పుడు ఊయల కట్టి ఊగిన ఎర్ర జామ పళ్ల చెట్టు అలానే ఉంది. ఇల్లు దగ్గరవుతోంది. ఏదో చెప్పలేని ఉద్వేగం నాలో.

గేటుకి ఓ పక్కన పాలరాతి పలక మీద చెక్కబడి ఉన్నాయి. 'చంద్రకళ' అందమైన అక్షరాలు. దూరం నుంచే చూసినట్టుంది చెల్లి. లోపల్నుండి గబ గబ పరుగులాంటి నడకతో

గేటు తీయడానికి వచ్చింది.

''ఇన్నాళ్లకి గుర్తొచ్చానా అన్నయ్యా'' నిష్టూరంగా అంటూనే గేటు తీసింది. చెల్లిని చూడగానే అలాగే చూస్తూ ఉండి పోయాను. చెప్పలేనంత ఆనందం నాలో.

''ఏరా నోట మాట రానట్టు పలకవేం...'' నా చెయ్యి పట్టుకొని ఊపుతూ అంది.

''ఈ అన్నయింకా గుర్తున్నాడటే...'' సరదాగా దాన్ని ఏడిపిద్దామని అన్నాను.

నా వైపు చిరు కోపంగా చూస్తూ నన్ను బరబరా వరండాలోకి లాక్కెళ్లింది. అక్కడ దృశ్యం చూసి ఒళ్లంతా కంపించింది.

''ఆ మాట అనడానికి నీకు నోరెల్లా వచ్చిందిరా! నీవు దగ్గరగా లేక పోయినా నిన్ను ఎలా మరుస్తాననుకున్నావు. ఇదిగో ఈ గచ్చు చూడరా. నీ గుర్తుగా దీన్నలాగే ఉంచేసుకున్నాను. మనం ఈ గచ్చు మీద ఆడిన ఆటలు ఎలా మరవగలను. మీ బావగారు, పిల్లలూ పాత ఇంటిని కూల్చేసి కొత్త ఇంటిని కట్టేస్తుంటే ఈ పాత గచ్చు ఇంకెందుకంటూ గొడవచేశారు. అయినా మన ప్రేమలు వాళ్లకెలా తెలుస్తాయి రా..''

చెప్పుకుపోతున్న చెల్లి మొహంలోకి తదేకంగా చూస్తున్నాను. దాని మాటలకి మనసు నీరైపోతోంది. ఉబికి వస్తోన్న దుఃఖాన్ని దాచలేకపోయాను.

''చెల్లీ...'' వణుకుతున్న కంఠంతో దాని తలని నా గుండెలకు హత్తుకున్నాను.

నా కళ్ల ముందున్న గచ్చు మీద నేనూ, చెల్లీ మళ్లీ చిన్నపిల్లలమైపోయి చదరంగం ఆడుతున్న దృశ్యం కదలాడుతోందిప్పుడు.